క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

కురవి: ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం కురవి, సీరోలు మండల కేంద్రాల్లో మూడు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. సీరోలు మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 194వ కేంద్రంలో 815 మంది ఓటర్లున్నారు. వీరిలో 586 మంది పురుషులు, 229 మంది మహిళలున్నారు. అలాగే కురవి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 185 పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా, అందులో 930 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 646 మంది, మహిళలు 284 మంది ఉన్నారు. 186వ పోలింగ్ కేంద్రంలో 901 మంది ఓటర్లకుగాను పురుషులు 608 మంది, మహిళలు 293 మంది ఓటర్లు ఉన్నారు. వీరు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

గ్రామాల్లో నర్సరీలను సిద్ధం చేయాలి



చిన్నగూడూరు: గ్రామాల్లో మొక్కలు పెంచేందుకు నర్సరీలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ యాకయ్య అన్నారు. బుధవారం మండలంలోని గుండంరాజుపల్లి, పగిడిపల్లి గ్రామాల్లో పల్లెప్రకృతి వనం, నర్సరీ, శ్మశానవాటికలను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలలో నర్సరీలు సిద్ధం చేసి రానున్న వర్షాకాలంలో మొక్కలను నాటాలని సూచించారు. మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీకాంత్, జీపీ సిబ్బంది ఉన్నారు.

జూన్ 6లోపు దరఖాస్తు చేసుకోవాలి

గార్ల: బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కోసం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు జూన్ 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బి.హరినాయక్ కోరారు. బుధవారం గార్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2024–25 సంవత్సరానికి గాను ఈ పథకం కింద 1వ తరగతి, 5వ తరగతిలో కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లు పొందేందుకు స్టడీ, కండక్ట్, కులము, ఆదాయం, ఆధార్‌కార్డ్, 2పాస్ ఫొటోలు దరఖాస్తుకు జతపర్చాలని సూచించారు.

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వామివారి, అమ్మవార్ల కల్యాణం బుధవారం కనుల పండువగా జరిగింది. పండితులు వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణ వేడుకలను భక్తులు తిలకించారు. అనంతరం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పండితులు అందించారు. నరసింహస్వామి రైస్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, ఎంపీటీసీ సట్ల వెంకన్న, కొమ్ము స్వాతిరాహుల్, పాదిల నర్సింహరెడ్డి, ప్రభాకర్, రడం వెంకన్న పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



గూడూరు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి ఘనంగా ప్రారంభమైనాయి. ఆలయ స్థానాచార్యులు వేదాంతం వరదరాజాచార్యులు, పూజారి వేణుగోపాలాచార్యులు, యాజ్ఞికులు నంద్యాల అనంత శేషరాజన్ బృందం పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఏపూరు శ్యాం సుందర్‌రెడ్డి, అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్, మేరుగు నరేష్‌గౌడ్, కాల్సాని వేణుమాధవ్‌రెడ్డి పాల్గొన్నారు.

పనుల పరిశీలన

చెన్నారావుపేట : పాఠశాలల అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి అని ఎంపీడీఓ గోవిందరావు తెలిపారు. మండలంలోని జల్లి కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను బుధవారం పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని సూచించారు. జూన్ మొదటి వారంలోగా పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో దయాకర్, మాధురి, కోమల, సంపత్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో జీవాల మృతి



కురవి: ఆవు వద్ద రోధిస్తున్న బాధితులు



మరిపెడ రూరల్: ఎడ్జెర్లలో..



తొర్రూరు రూరల్: నాంచారీమదూరు గ్రామంలో..



డోర్నకల్: తెల్లబండతండాలో..

కురవి: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని నల్లెల్ల గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బలపాల శివారు లింగ్యా తండా గ్రామానికి చెందిన ధరంసోత్ రవి అనే రైతుకు చెందిన ఆవు మేత కోసం బయటకు వెళ్లింది. చేనులో విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌తో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. దాని విలువ సుమారు రూ.70వేల వరకు ఉంటుందని రైతు రవి తెలిపారు. రైతు కుటుంబానికి పరిహారం చెల్లించాలని తెలంగాణ గిరిజన సంఘం నాయకుడు మాలోత్ కిషన్ నాయక్ డిమాండ్ చేశాడు.

ఎడ్జెర్లలో పాడి గేదె..

మరిపెడ రూరల్: విద్యుదాఘాతంలో పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని ఎడ్జెర్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఎడ్జర్ల గ్రామానికి చెందిన రైతు ఉప్పునూతల శ్రీను తన గేదెలను పచ్చిక బైళ్ల కోసం గ్రామ శివారులో వదిలిపెట్టాడు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్ షాక్ గురై గేదె అక్కడి అక్కడే మృతి చెందింది. దాని విలువ రూ.50వేలు ఉంటుందని రైతు శ్రీను బోరున విలపించాడు.

తెల్లబండతండాలో గేదె..

డోర్నకల్: మండలంలోని తెల్లబండతండా గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామానికి చెందిన బానోత్ పెద వెంకన్నకు చెందిన గేదె బుధవారం మేతకు వెళ్లి తెగిపడిన విద్యుత్ తీగలకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

నాంచారీమదూరులో రెండు పాడి గేదెలు..

తొర్రూరు రూరల్: మండలంలోని నాంచారీమదూరు గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై రెండు పాడిగెదెలు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గ్రామానికి చెందిన బంగారి సోమయ్యకు ఉన్న రెండు పాడిగేదలను రోజువారీగా మేత కోసం గ్రామ శివారులోకి తీసుకెళ్లాడు. తెగిపడి ఉన్న విద్యుత్ తీగకు గేదెలు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని బాధిత రైతు సోమయ్య విలపించాడు.

అత్యధిక మెజార్టీతో గెలిపించండి

మహబూబాబాద్ రూరల్: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేందర్ రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని ముడుపుగల్లు, అమనగల్, సింగారం గ్రామాల్లో బుధవారం పట్టభద్రుల ఓటర్ల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు యాప సీతయ్య, అసెంబ్లీ కన్వీనర్ కొమ్మాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు మారగాని రాజుగౌడ్, పట్టణ ఉపాధ్యక్షుడు చుక్కల నరేష్, బూత్ అధ్యక్షుడు సీహెచ్ వెంకన్న, శివ, శంకర్ పాల్గొన్నారు.

డోర్నకల్: మండలంలోని అమ్మపాలెం తహసీల్దారు బంజర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద బుధవారం బీజేపీ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నాయకుడు వేముల సుదర్శనం ప్రచారం చేశాడు.



మహబూబాబాద్ రూరల్: ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

దంతాలపల్లి: గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారపు వెంకన్న కోరారు. బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గుండగాని భరత్, జిల్లా నాయకులు సహదేవ్, కొమ్ము శోభన్, బండి నరేష్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు మహంకాళి సురేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు



వివరాలు వెల్లడిస్తున్న సామాజిక తనిఖీ బృందం

మహబూబాబాద్ రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 15వ విడుత సామాజిక తనిఖీ ఇన్ హౌస్ వేదిక మహబూబాబాద్ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు మండలంలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు సేకరించిన వివరాల నివేదికను ఇన్ హౌస్ వేదిక సందర్భంగా అడిషనల్ డీఆర్డీఓ శాంతకుమారి, సంబంధిత అధికారుల ఎదుట చదివి వినిపించారు. పనుల్లో అవకతవకలు జరిగాయని గుర్తించి చివరగా రూ.8,33,625 రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారని ఎంపీడీఓ రవికుమార్, ఈజీఎస్ ఏపీఓ రమేష్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రీవెన్స్ అధికారి బెస్త ఆదాం, స్టేట్ రిసోర్స్ పర్సన్ కుమార్, అడిషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ అంజు గౌడ్, పీఆర్ ఏఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

డీఈఓను వెంటనే సస్పెండ్ చేయాలి

మహబూబాబాద్ అర్బన్: గిరిజన ఉద్యోగులపై జాతి వివక్షత చూపుతున్న, గిరిజన మహిళ ఔట్ సోర్సింగ్ అటెండర్ ఉద్యోగిని మానసికంగా వేధించి విధుల నుంచి తొలగించిన డీఈఓను వెంటనే సస్పెండ్ చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్‌నాయక్ డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణకు ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. బీఈడీ విద్యార్హత లేని డీఈఓను వెంటనే తొలగించాలని, గిరిజన మహిళ ఉద్యోగిని మానసికంగా వేధించినందుకు సుమోటోగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య బాలాజీనాయక్, టౌన్ అధ్యక్షుడు హతిరాంనాయక్ పాల్గొన్నారు.



ఆర్జేడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జీవవైవిధ్య పరిరక్షణ సామాజిక బాధ్యత



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎఫ్ఆర్ఓ, తదితరులు

నర్సంపేట: జీవ వైవిధ్య పరిరక్షణను సామాజిక బాధ్యతగా ఎఫ్ఆర్ఓ రవికిరణ్ అభివర్ణించారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ అటవీ క్షేత్ర కార్యాలయ ఆవరణలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జీవ వైవిధ్య పరిరక్షణ వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడారు. భూమిపై జీవరాశుల మనుగడలో జీవ వైవిధ్యం తప్పనిసరి అని చెప్పారు. వాతావరణ కాలుష్యం వల్ల అనేక జీవరాశులు మనుగడ కోల్పోతున్నాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం సమాజంలోని ప్రతీ ఒక్కరు పాటుపడాలని కోరారు. ఏఎస్ఆర్ సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్ మాట్లాడుతూ.. భూమిపై జీవాల భేదాన్ని జీవ వైవిధ్యం అంటారని తెలిపారు. పర్యావరణ కాలుష్యంతో భూగోళం వేడెక్కి జీవ వైవిధ్యం దెబ్బ తింటోందన్నారు. అనేక జీవ, వృక్ష జాతులు అంతరించి పోతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ప్రతీ ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు బాటలు వేయాలని ఆకాంక్షించారు. స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్, ఛాయ సంస్థ నిర్వాహకుడు కోట డేవిడ్ మాట్లాడుతూ.. మానవజాతి మనుగడ జీవ వైవిధ్య పరిరక్షణ మీదే ఆధారపడి ఉందని స్పష్టం చేశారు. మానవ తప్పిదాల వల్ల ప్రత్యేక పలు జీవ, వృక్ష జాతులు అంతరించి పోతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కన్స్యూమర్ ఫోరమ్ విజిలెన్స్ కమిటీ మెంబర్ నాగెల్లి సారంగం గౌడ్, సోషల్ వలంటీర్ మొగిలిచర్ల రాము సేవక్ పాల్గొన్నారు.

ఇసుక తరలింపు అడ్డగింత

దేవరుప్పుల: మొన్నటి వరకూ అభివృద్ధి నిర్మాణ పనుల పేరిట అక్రమంగా ఇసుక రవాణా కొనసాగిన వాగు పరివాహక ప్రాంతాల్లో ఏకంగా రిజర్వాయర్ల నిర్మాణం కోసం ప్రభుత్వం అనుమతి పేరిట గొల్లపల్లి ఇసుక తరలింపునకు శ్రీకారం చుట్టగా బుధవారం రైతులు అడ్డుకున్నారు. గొల్లపల్లి శివారులో పాలకుర్తి రిజర్వాయర్ కోసమని ఇసుక తరలించేందుకు ట్రాక్టర్లు వాగులోకి దిగాయి. విషయం తెలువగానే పీఏసీఎస్ దేవరుప్పుల మాజీ చైర్మన్ ధర్మారెడ్డి ఆధ్వర్యంలో రైతులు చేరుకొని ఇసుక తరలిస్తే భూగర్భజలాలు అటుగంటుతాయని నిలువరించడంతో తాత్కాలికంగా ఇసుక తీయడాన్ని ఆపేశారు.

భక్తిశ్రద్ధలతో నమ్మాళ్వార్ తిరునక్షత్ర ఉత్సవం



మహబూబాబాద్ రూరల్: శ్రీవైష్ణవ సంప్రదాయ ఉద్ధరణ పూజ్యులు నమ్మాళ్వార్ తిరు నక్షత్ర (జన్మదిన) ఉత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీవేణు గోపాలస్వామి వారి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. నమ్మాళ్వార్ స్వామివారు శ్రీవైష్ణవ సంప్రదాయంలో మహోన్నతమైన పేరెన్నికగన్న నాలుగువేల పాశురాల గ్రంథాన్ని ప్రపంచానికి అందజేసిన మహనుభావులని ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై లక్ష్మీనారాయణచార్యులు తెలిపారు. ఉత్సవంలో భాగంగా స్వామి వారికి అభిషేకం, అలంకారం, పుష్పార్చన పూజ, సేవాకాలం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు.

ఇన్‌చార్జ్ కార్యదర్శుల నియామకం

మరిపెడ రూరల్: మండలంలోని వీరారం జక్కుల నరేష్, చిల్లంచర్ల గ్రామానికి ఏ.ఉమేష్‌లను ఇన్‌చార్జ్ కార్యదర్శులుగా నియమించినట్లు ఎంపీడీఓ రేవతి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సంక్షిప్త సమాచారం

యూనిఫాం క్లాత్ పంపిణీ

మరిపెడ/మరిపెడ రూరల్: మరిపెడ కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలోని అన్ని ప్రభుత్వ స్కూల్ విద్యార్థుల యూనిఫాం క్లాత్‌ను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు బుధవారం పంపిణీ చేశారు. హెచ్‌ఎంలు గ్రామంలోని వీఓ అధ్యక్షులకు అప్పగించారు. కార్యక్రమంలో ఏపీఎం రాములు, స్కూల్ హెచ్‌ఎంలు, సీఆర్పీలు సత్య శ్రీనివాస్, రమేష్, జానికిరాములు, బంగారియా, నరేష్, సీసీలు పాల్గొన్నారు.

హనుమాన్ నగర సంకీర్తన



కొత్తగూడ: మండలకేంద్రంలో హనుమాన్ మాల ధరించిన స్వాములు హనుమాన్ విగ్రహంతో ఘనంగా నగర సంకీర్తన చేశారు. రామ నామ జపం చేస్తూ స్వాములు ర్యాలీ నిర్వహించారు. మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్ అన్నదానం ఏర్పాటు చేశారు.

రుణమాఫీ చేయాలి

కొత్తగూడ: రైతులకు రుణమాఫీ జూన్ 15లోపు చేసి కొత్త రుణాలు అందించాలని సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని అయిలయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడారు. ఈసమావేశంలో బూర్క వెంకటయ్య, యుగెందర్, శ్రీశైలం, మంగన్న, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమావేశం

కేసముద్రం: మండలంలోని అమీనాపురంలోని శ్రీభూనీలా సమేతా వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమావేశాన్ని నిర్వహించారు. ఈమేరకు వచ్చే నెల 23 నుంచి 25 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వోలం మురళీ, ప్రధాన కార్యదర్శి బచ్చు పరమేశ్వర్, కోశాధికారి కోయగూరి యాకుబ్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు వద్దిరాజు దేవేందర్, ఉపాధ్యక్షుడు వెంకట్రాంనర్సయ్య పాల్గొన్నారు.

ఘన నివాళి



గార్ల: సింగరేణి కాలరీస్ సీఐటీయూ సీనియర్ కార్మిక ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్యే పర్సా సత్యనారాయణ వర్ధంతిని బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ నాయకులు నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాసరావు, ప్రవీణ్‌కుమార్, కోటయ్య, రాజేష్, రాము, అంజయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మించొద్దు

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లిలో జనావాసాల మధ్య సెల్‌టవర్‌ను నిర్మించవద్దని గ్రామస్తులు కోరారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్‌కు బుధవారం గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రమేష్, మధార్, వెంకటేష్, రాధమ్మ, పాపయ్య, రేణుక తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

తొర్రూరు రూరల్: మండలంలోని గుర్తూరు గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బొర్ర సోమయ్య, తొర్రూరు పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన మంగళపెల్లి నిర్మల మృతదేహాలకు జెడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్‌తోపాటు బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి బుధవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మాచర్ల వెంకన్నగౌడ్, రాయిశెట్టి వెంకన్న, రాయిశెట్టి ఉపేందర్, ఈదురు వెంకన్న పాల్గొన్నారు.

డోర్నకల్: సీరోలు మండలం మన్నెగూడెం గ్రామంలో బుధవారం విద్యుదాఘాతంతో ఏడు పశువులు మృతి చెందాయి. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ బాధితులను పరామర్శించారు.

నేడు మంత్రి, మాజీ మంత్రి రాక

మరిపెడ రూరల్: పట్టభద్రుల ఎన్నిక ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న తరపున వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్, బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి తరపున మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు బుధవారం మరిపెడకు రానున్నట్లు ఇరువురు పార్టీల నాయకులు తెలిపారు.

సంతకాల సేకరణ



కేసముద్రం: మండల కేంద్రంలో 90 ఫీట్ల వెడల్పు రోడ్డు, డివైడర్‌తో సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని, దీంతో దుకాణాలు, ఇళ్లు పూర్తిగా కోల్పోయే పరిస్థితి ఉందంటూ కేసముద్రంస్టేషన్ మార్కెట్ రోడ్‌కు చెందిన పలువురు ఇళ్లు, దుకాణాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు రోడ్డు వెడల్పును 50 ఫీట్ల వరకే పెంచాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్‌ను కోరుతూ బుధవారం ఇళ్లు, దుకాణాదారులు సంతకాలను సేకరించారు.

మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి



గూడూరు: కాంగ్రెస్ పార్టీ బలపర్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపునకు పార్టీలోని విద్యావంతులు, కార్యకర్తలు కృషి చేయాలని మహబూబాబాద్ పార్లమెంట్ ఎమ్మెల్సీ కోఆర్డినేటర్ సిరిపురం వీరన్న కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశ అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాసమల్ల యాకయ్య, నాయకులు భూక్య బాలూనాయక్, వేణు, రమణారెడ్డి, కృష్ణారెడ్డి, మాలూనాయక్, శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ, జనుము విత్తనాలు

డోర్నకల్: రైతులకు అందుబాటులో జీలుగ, జనుము విత్తనాలతోపాటు పచ్చిరొట్ట ఎరువులు ఉన్నాయని వ్యవసాయ విస్తరణ అధికారి ఎర్ర కర్ణ తెలిపారు. మండలంలోని డోర్నకల్ పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జీలుగ 30కేజీల బస్తా సబ్సిడీపై రూ.1116, జనుము 40 కేజీలకు రూ.1,448, పిల్లిపెసర 20కేజీలు రూ.1,084 చొప్పున అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డోర్నకల్, మన్నెగూడెం పీఏసీఎస్ కార్యాలయాల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎర్ర కర్ణ కోరారు.

మహబూబాబాద్ రూరల్: వానాకాలం ఈ ఏడాదికి సంబంధించి వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి నారెడ్డి తిరుపతిరెడ్డి బుధవారం తెలిపాడు. మహబూబాబాద్ పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఆగ్రోస్ 1, ఆగ్రోస్ 2, సింగారం గ్రామంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగు, జనుము, పిల్లిపెసర ఉన్నాయన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

చిన్నగూడూరు: మండల కేంద్రానికి చెందిన పోల్కం నాగన్న(ఆటో డ్రైవర్) తల్లి కమలమ్మ అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. సోషల్ మీడియాలో 'దాశరథి పురిటిగడ్డ' వాట్సాప్ గ్రూప్ ద్వారా విషయం తెలుసుకున్న మండల కేంద్రానికి చెందిన గాడిపెల్లి సునీల్ రూ.5వేల ఆర్థికసాయం బుధవారం అందజేశాడు.

నెల్లికుదురు: మండల కేంద్రంలో ఇటీవలే గుండెపోటుతో మృతి చెందిన కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సలుగు పూర్ణచందర్ కుటుంబానికి జిల్లా అధ్యక్షుడు తోట వెంకన్న, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లుతో కలసి బుధవారం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో యాకయ్య, వెంకన్న, మౌనేందర్, క్రాంతిరెడ్డి నర్సయ్య, కొమురెల్లి పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: మండలంలోని ఉల్లెపల్లి గ్రామానికి చెందిన గుండె మహేష్ (34) ఆర్థిక ఇబ్బందులు తలలేక ఈనెల 14న పురుగుల మందు తాగి మృతి చెందాడు. దీంతో ముగ్గురు పిల్లలు తండ్రి లేని అనాథలయ్యారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ముందుకు వచ్చి బాధిత కుటంబానికి రూ.3వేలు, అరక్వింటా బియ్యాన్ని సాయం చేసి ఔదర్యాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో వెంకన్న, శ్రీను, జానయ్య, విష్ణు, నాగరాజు, భిక్షపతి ఉన్నారు.



నెల్లికుదురు: ఆర్థికసాయం చేస్తున్న నాయకులు

బాలుడిని కబళించిన ట్రాక్టర్

- వాహనం మీది నుంచి పడి మృతి
- వేములపల్లిలో ఘటన

దంతాలపల్లి: మాయదారి మృత్యువు. మాటు వేసి కాటు వేసింది. ట్రాక్టర్ రూపంలో బాలుడిని అమాంతం మింగింది. తమ్ముడికి బైబై చెప్పి ట్రాక్టర్ ఎక్కిన అన్నను బలితీసుకుని ఆ కుటుంబానికి పుట్టెడు శోకం మిగిల్చింది. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం వేములపల్లికి చెందిన అంగన్‌వాడీ టీచర్ మౌనిక, పుల్లయ్య దంపతులకు నలుగురు పిల్లలు ఉన్నారు. మొదటి కాన్పులో కవలలు రామ్‌కుమార్, లక్ష్మణ కుమార్, భరత్‌కుమార్ జన్మించారు. రెండో కాన్పులో శశికుమార్ జన్మించాడు. ఈక్రమంలో రామ్‌కుమార్(16) మరిపెడ మండలకేంద్రంలో ఓ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి ఉత్తీర్ణత సాధించాడు. వేసవి సెలవులు కావడంతో ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో గ్రామంలోకి కొంతమంది ట్రాక్టర్లలో మొరం తోలుతున్నారు. తమ్ముడు లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ఉన్న రామ్‌కుమార్ తమ్ముడు వద్దంటున్నా వినకుండా ట్రాక్టర్ ఎక్కి ఇంజన్‌పై కూర్చున్నాడు. సరిగా పట్టుకోకపోవడంతో అదుపు తప్పి ట్రాక్టర్ ఇంజన్, టేలర్ మధ్యలో పడ్డాడు. దీంతో ట్రాక్టర్ వెనుక టైరు రామ్‌కుమార్ మీది నుంచి వెళ్లింది. గమనించిన డ్రైవర్ ట్రాక్టరును ఆపాడు. వెంటనే దంతాలపల్లి ప్రజావైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తండ్రి పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృత దేహాన్ని పరీక్ష నిమిత్తం మహబూబాబాద్ ఏరియా అస్పత్రికి తరలించినట్లు ఎస్సై కరుణాకర్ తెలిపాడు.



తమ్ములతో రామ్‌కుమార్ (మధ్యలో వ్యక్తి)

నర్సుకు సన్మానం

దంతాలపల్లి: మండల కేంద్రంలో గల ప్రజావైద్యశాలలో విధులు నిర్వహించి, మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి బదిలీ అయిన సందర్భంగా నర్సు వెంకటలక్ష్మిని బుధవారం వైద్యాధికారి చైతన్య, సిబ్బంది సన్మానించారు. సీహెచ్ఓ బాలాజీ, సత్యనారాయణ, చలపతిరావు పాల్గొన్నారు.